క్లుప్తంగా

నిర్మాణాలు ఆపాలని నోటీసులు



నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని తెలియజేస్తున్న పంచాయతీ సిబ్బంది

పాతపట్నం: మండల కేంద్రంలోని ఉమామహల్‌లో సుడా, పంచాయతీ అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణమే నిర్మాణ పనులు అపాలని పంచాయతీ సిబ్బంది శుక్రవారం నోటీసులు అందజేశారు. ఉమామహల్‌ను రీ మోడలింగ్ చేసేందుకు సుడా, పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని, అందువలనే నోటీసులు అందజేశామని ఈవో వై.వరప్రసాదరావు తెలిపారు.

లారీ - ఆర్టీసీ బస్సు ఢీ



బ్రిడ్జి సమీపంలో రహదారిపై ఢీకొన్న లారీ, బస్సు

ఆమదాలవలస: పట్టణ శివారులోని శ్రీకాకుళం - పాలకొండ రహదారి ఫ్లై ఓవర్ దిగువన చెరుకు లారీ, ఆర్టీసీ బస్సులు శుక్రవారం ఢీకొన్నాయి. శ్రీకాకుళం వైపు నుంచి సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న చెరుకు లోడు లారీ ఫ్లైఓవర్ దిగువకు చేరుకుంటున్న సమయంలో, హిర మండలం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కూడా ఫ్లై ఓవర్ మీదకు వెళ్లేందుకు వచ్చింది. ఆ సమయంలో లారీలో ఉన్న చెరుకు కట్టలు బస్సు ముందు భాగం అద్దాల లోపలకి చొచ్చుకుపోయాయి. అయితే ఇరు వాహనాల డ్రైవర్లు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో సుమారు 30 నిమిషాలు పాటు పాలకొండ - శ్రీకాకుళం - ఆమదాలవలసకు రాకపోకలు నిలిచిపోయాయి.

కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరు పంచాయతీ పరిధిలోని ఎస్ఎస్ కాలనీలో పలు వీధులకు సీసీ డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో స్థానికుల వినతుల మేరకు సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావులు సీసీ కాలువల పనులను శుక్రవారం ప్రారంభించారు. కాలువ నిర్మాణాలకు అవసరమైన స్థలంలో పిచ్చి మొక్కలను తొలగించారు.

ఆర్థిక సాయం అందజేత



రాముకు నగదు అందజేస్తున్న సర్పంచ్ జీవీ రమణి దంపతులు

జలుమూరు: మండలంలోని జోనంకి పంచాయతీ పరిధి గంగాధరపేటకు చెందిన దివ్యాంగ దంపతులు కొర్ను రాము, అక్షయలకు సర్పంచ్ జీవీ రమణి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం గంగాధరపేటలో ఆ దంపతుల గృహ ప్రవేశానికి హాజరై నగదు అందించారు. రాము మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న దయతో ఇల్లు మంజూరు అయ్యిందని హర్షం వ్యక్తం చేశాడు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోవాలి



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అచ్యుతాపురం పశువైద్య అధికారి పట్ట సంతోష్ కుమార్ సూచించారు. మండలంలోని మర్రివలస, శ్రీమన్నారాయణపురం గ్రామాల్లో పశువులు, గొర్రెలకు వ్యాక్సిన్లు శుక్రవారం వేశారు. ప్రధానంగా గర్భకోశ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి చర్యలు

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో 10,631 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.4,56,37,500ల నిధులు విడుదలైనట్లు ఎంపీడీవో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిధులను వెల్ఫేర్ అసిస్టెంట్లకు బ్యాంకుల ద్వారా అప్పగించినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచే సచివాలయాల సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

బాదుడే బాదుడు..!

- భారీగా పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు
- నరసన్నపేట టౌన్‌లో 15 శాతం పెంపు
- రూరల్ గ్రామాల్లో 80 శాతం వరకు పెంపు
- నేటి నుంచి కొత్త చార్జీలు అమలు

నరసన్నపేట: సంపద సృష్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఆదాయం పెంచుకోవడానికి ప్రజలపై భారం వేస్తోంది. ఇప్పటికే నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీల పేరుతో బాదుడు చేపట్టింది. దీనికి తోడు తాజాగా భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెంచింది. కొత్త ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి.

భారీగా భూముల విలువ పెంపు

నరసన్నపేట సబ్ రిజిస్ట్రార్ పరిధిలో పోలాకి, నరసన్నపేట మండలాలు, జలుమూరు, కోటబొమ్మాళి మండలాల్లో కొన్ని పంచాయతీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలు రెట్టింపు స్థాయిలో ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో 80 శాతం వరకు పెరిగాయి. నరసన్నపేట టౌన్‌లో ఇప్పుడున్న ధరలకు 15 శాతం మేరకు పెంచుతున్నారు. మైనర్ పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు 80 శాతం వరకు పెంచారు. దీంతో నమ్మి ఓట్లు వేసినందుకు తగిన బుద్ధి చెబుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఏడు నెలల్లోనే ఇంత బాదుడా అని ఆశ్చర్యపోతున్నారు.



నరసన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావం

రిజిస్ట్రేషన్ల పెంపు ధరలతో స్థానికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇలా అయితే భూముల కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా పడిపోతాయని అంటున్నారు. నరసన్నపేట టౌన్‌లో స్కేర్ ఫీట్లలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో ఒకేలా 15 శాతం మేరకు పెంచారు. పాత జాతీయ రహదారికి ఆనుకొని రేట్లు ఈవిధంగా ఉంటేనే భారం అవుతుంది. అలాంటిది వీధుల్లో కూడా ఈ ధరలే అంటే భరించడం ఆర్థికంగా ఇబ్బందికరమే. ఇంత దారుణంగా కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధరలు పెంచడం అన్యాయమని వాపోతున్నారు. మరో పక్క గ్రామాల్లో సైతం ఒకేసారి 80 శాతం పెంపు అంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంపు కసరత్తు ఇలా..

- ఆర్టీసీ కాంప్లెక్స్, కళాసీ యూనియన్ ఆఫీస్ ప్రాంతాల్లో ప్రస్తుతం గజం రూ.13 వేలు ఉండగా, రూ.15 వేలుకు పెరిగింది. ఇక్కడ ప్రస్తుతం ఉన్న విలువకు 15 శాతం పెరుగుతోంది.
- పెద్దపేట, జమ్ము కూడలి పరిధిలో గజం రూ.15 వేలుకు పెరిగింది.
- సెగిడివీధి, బండి వీధుల పరిధిలో గజానికి రూ.3 వేలు వరకు పెరిగింది. అలాగే గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో కూడా ధరలను పెంచుతున్నారు. ఈ వీధుల్లో అడుగుకు రూ.600లు పెరిగింది.
- బజారు వీధి, నేతాజీ వీధి, లక్ష్మీ టాకీస్, కోవెల వీధుల్లో గజం రూ.3 వేలు వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగాయి.
- బొడ్డవలస ప్రాంతంలో ఏకంగా 54 శాతం మేర భూముల విలువ పెంచారు. ప్రస్తుతం ఎకరా రూ.13 నుంచి రూ.18 లక్షల వరకు ఉండగా, దీనిని రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు పెంచారు.
- జమ్ములో 54 శాతం, గొట్టిపల్లిలో 17 నుంచి 33 శాతం వరకు, దేవాది ప్రాంతంలో 22 శాతం నుంచి 50 శాతం మేరకు భూముల ధరలు పెరిగాయి.
- కోమర్తిలో డ్రై ల్యాండ్ 50 శాతం, వెట్ ల్యాండ్ 33 శాతం మేరకు భూముల ధరలు పెంచారు. మడపాంలో 50 శాతం, కరగాంల్లో 20 శాతం వరకు పెంచారు.
- బాలసీమ, బసివలస, చేనులవలస, చిక్కాలవలసల్లో పల్లపు భూముల విలువ 63 శాతం, మెట్టు భూములు 50 శాతం మేరకు ధరలు పెరిగాయి. అలాగే తోటలు ఎకరా రూ.10 లక్షలు ఉండగా, దీనిని రూ.17 లక్షలకు పెంచారు.
- పోలాకి మండలంలో 80 శాతం మేరకు రిజిస్ట్రేషన్ ధరలు పెంచారు. దీర్ఘాసి, ఈదులవలస, తోటాడ, అంప్లాం, చీడివలస తదితర గ్రామాల్లో 82 శాతం మేరకు ధరలు పెంచారు.

పాతపట్నంలో పెంపు ఇలా...

పాతపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రాంతాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న విలువలో 10 నుంచి 30 శాతం వరకు పెరగనున్నాయి. ఎకరాకు సుమారు రూ.7,500లు పెరగనున్నాయి. నిర్మాణాలు, భూముల మార్కెట్ విలువను పెంచేందుకు డిసెంబర్–2024 సంవత్సరంలోనే సబ్ రిజిస్ట్రార్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కమిటీ ముందు ఉంచారు. వాటినే ఇటీవల ఆమోదించారు. పెంచిన భూముల మార్కెట్ విలువలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తున్నాయి. దీంతో ప్రజల నెత్తిన భారం మోపుతూ ఆదాయాన్ని పెంచుకోవడం తప్ప, ప్రజలకు మేలు కలిగించే పనులు ఒక్కటి కూడా కూటమి ప్రభుత్వం చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలతో కొత్త ధరలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారుల సూచనలతో రిజిస్ట్రేషన్ ధరలు పెరిగాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి కొత్త ధరల ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేయనున్నాం. పెరిగిన ధరల వివరాలు కార్యాలయంలో అందుబాటులో ఉంచాం.

– బసవేశ్వరరావు, సబ్ రిజిస్ట్రార్, నరసన్నపేట

పెంపు సరికాదు



నరసన్నపేట ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెంచడం సరికాదు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం వరకు పెంచడం దారుణం. రిజిస్ట్రేషన్ చార్జీలు ఇంత అధికంగా ఎప్పుడూ పెరగలేదు. ఇది కూటమి ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. ఈవిధంగా ధరల పెంపు కూటమి ప్రభుత్వానికే చెల్లింది. పెంచిన ధరల భారం తగ్గించాలి.

– కేసీహెచ్‌బీ గుప్త, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు

అధ్వానం



ఆమదాలవలస మండలంలోని బొబ్బిలిపేట గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వెదుళ్లవలస జంక్షన్ నుంచి పాలకొండ రోడ్డు వరకు దాదాపుగా ఐదు కిలోమీటర్ల పొడవున గోతులు ఏర్పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నెల్లిపర్తి, గొల్లపేట, తురకపేట, వెదుళ్లవలస, దండేంవలస, బొబ్బిలిపేట గ్రామస్తులు మండల కేంద్రం ఆమదాలవలస చేరుకునేందుకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందువలన అధికారులు స్పందించి, రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – ఆమదాలవలస

అవగాహన



పొందూరు మండలంలోని తాడివలస జెడ్పీ హెచ్ ఉన్నత పాఠశాలలో పిల్లల్లో అయోడిన్ లోపం వలన కలిగే దుష్పరిణామాలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డవలప్‌మెంట్(ఐజీడీ, ఢిల్లీ) అవగాహన కార్యక్రమం శుక్రవారం చేపట్టింది. ఈ సందర్భంగా విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్, ఐజీడీ రీసోర్స్ పర్సన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అయోడిన్ లోపం వస్తే డ్రెస్కిన్, థైరాయిడ్ సమస్య, ఎదుగుదలలో లోపం ఏర్పడుతుందని చెప్పారు. రోజూ ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐజీడీ జిల్లా కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, హెచ్ఎం బల్ల కంటయ్య తదితరులు పాల్గొన్నారు. – పొందూరు

అమలు



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో నరసన్నపేటతో పాటు రూరల్ గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ప్రధానంగా నరసన్నపేటలో పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి ఆధ్వర్యంలో సిబ్బంది ఫ్లెక్సీలు తొలగింపు చేపట్టారు. ఎంపీడీవో మధుసూదనరావు మాట్లాడుతూ కోడ్ నేపథ్యంలో అన్నిచోట్ల రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలని, అశ్రద్ధ చేస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు. – నరసన్నపేట

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నరసన్నపేట: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం జనాలతో శుక్రవారం కిటకిటలాడింది. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ ధరలు పెరగనుండడంతో వీలైనన్ని ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో రద్దీ కనిపించింది.



రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన జనాలు

త్వరితగతిన సర్వే పూర్తి చేయాలి

- జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీకాంత్

జలుమూరు: కుష్టు వ్యాధిని నిర్ధారించే ఎల్సీడీసీ సర్వే త్వరితగతిని పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి తాడేల శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం జలుమూరులో సర్వే తీరును పరిశీలించి మాట్లాడారు. ఇంటింటా సర్వే ద్వారా పూర్తి స్థాయిలో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జలుమూరు పీహెచ్‌సీలో కుష్టు రోగులకు దాతల అందించిన దుప్పట్లు, ఇతర వస్తువులు శనివారం అందజేయనున్నట్లు తెలిపారు. జలుమూరుతో పాటు తిలారు, సైరిగాం, ఉర్లాం, సారవకోట, బొంతు, మాకివలస, అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధి కుష్టు రోగులకు ఈ వస్తువులు అందజేయనున్నారు. జిల్లా న్యాయసేవా సాధికారిక సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ కుమార్, ప్రోగ్రామ్ మేనేజర్ ఆదిలింగం, మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ, సీహెచ్‌వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ అధికారి శ్రీకాంత్

వేమన పద్యాలపై ప్రచారం

కొత్తూరు: యోగి వేమన జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బలద గ్రామంలో వేమన పద్యాల్లోని జ్ఞానంపై శుక్రవారం ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి బొద్దాం గ్రామ కమిటీ అధ్వర్యంలో ప్రచారం జరిగింది. యోగి వేమన దైవ సమానుడని, అందువలన ఇక నుంచి వేమన భగవాన్ అని పిలువడం జరుగుతుందన్నారు. త్రైత సిద్ధాంతం సారాంశాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బొద్దాం గ్రామ కమిటీ అధ్యక్షుడు రామినాయుడు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రచార కమిటీ సభ్యులు

ధాన్యం కొనుగోళ్లకు సమయమివ్వాలి

బూర్జ: మండలంలో ధాన్యం కొనుగోళ్లకు మరికొంత సమయం ఇవ్వాలని మాజీ జెడ్పీటీసీ, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో జరిగిన సమావేశంలో సివిల్ సప్లయ్ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్‌కు రైతుల సమస్యలు తెలియజేసి, వినతిపత్రం అందజేశారు. మండలంలో ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కర్రోతు బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

ఆమదాలవలస: శ్రీకన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆమదాలవలస పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలితా సహస్ర నామ పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆంధ్రరాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఆత్మకూరి రామకృష్ణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తమ్మన రామకృష్ణ, గౌరవ సభ్యులు టి.బంగారురాజు, టి.శ్రీనివాసరావు, కె.శంకరరావు, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో కొలువైన అభయాంజనేయ స్వామి చక్రతీర్థ స్నానాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీలో శోభ యాత్ర నిర్వహించి, స్థానిక కోనేరులో చక్రతీర్థ స్నానాలు చేపట్టారు. మూడు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించామని, అనంతరం స్వామివారి చక్రతీర్థ స్నానాలు చేపట్టినట్లు అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు.



ఉత్సవ విగ్రహాలను చక్రతీర్థ స్నానాలకు తీసుకెళ్తున్న దృశ్యం

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



జోనంకి సర్పంచ్ జీవీ రమణి

జలుమూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని నరసన్నపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, జోనంకి సర్పంచ్ జీవీ రమణి శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి శ్రీకాకుళం ఉమెన్స్ హాస్టల్‌లో విద్యార్థినిపై జరిగిన దాడిని ఖండించారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రశాంతమైన శ్రీకాకుళం పట్టణంలో ఇలాంటి దాడులు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. హోంమంత్రి స్పందించి విద్యార్థినికి న్యాయం చేయాలన్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

నరసన్నపేట: మండలంలోని తండ్యాలవానిపేట వద్ద శుక్రవారం కోడి పందాలు నిర్వహిస్తున్న గుంపుపై నరసన్నపేట పోలీసులు ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో దాడి చేశారు. దీంట్లో 11 మంది పట్టుబడగా వీరి వద్ద నుంచి రూ.36,286లు సీజ్ చేశారు. అలాగే ఆరు సెల్‌ఫోన్లు, ఇక ద్విచక్ర వాహనం, 4 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అ'పూర్వ' సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

కొత్తూరు: మండలంలోని ఎస్ఎస్ కాలనీలో గీతాంజలి ఉన్నత పాఠశాలలో 1999–2000 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ కలయిక కొత్తూరులో శుక్రవారం జరిగింది. 25 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పడాల కిషోర్, వడ్డీ తులసీరామ్, సంతోష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటితో అవస్థలు

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి నేతాజీనగర్ కాలనీలో ప్రధాన వీధి నందు, హడ్డుబంగి గెడ్డ మీద నిర్మించిన కల్వర్టు మీద నుంచి మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో కాలనీ ప్రజలు నరకయాతన పడుతున్నారు. హడ్డుబంగి గెడ్డలో పూడికలను సంవత్సరాల తరబడి నీటిపారుదల శాఖ తొలగించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

2న సాఫ్ట్ టెన్నిస్ ఎంపికలు

పాతపట్నం: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 2న ఉదయం 9 గంటలకు పాతపట్నం ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో జిల్లాస్థాయి సాఫ్ట్ టెన్నిస్ సబ్ జూనియర్ బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు, సెక్రటరీలు గురాడి అప్పన్న, జె.షణ్ముఖరావు శుక్రవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు. 2010 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని చెప్పారు.

అర్హులందరికీ ఉపాధి పనులు

ఎల్.ఎన్.పేట: అర్హులందరికీ 100 రోజుల ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు చేయించి గిట్టుబాటు కూలి లభించేలా చూడాలన్నారు. వేతనదారులకు పనులు కల్పించడంతో పాటు ఈ పథకం ద్వారా అమలవుతున్న పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు ఈ పథకం ఏపీవో వి.శ్రీదేవి ఉన్నారు.

పరామర్శ



స్వర్ణలతను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తోట తులసీదాసు నాయుడు భార్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్ తల్లి తోట స్వర్ణలత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఆమెను పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శుక్రవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తోట నందకుమార్, కిరణ్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, మాసీ ఉప సర్పంచ్ ఎద్దు హరిదాసు తదితరులు పాల్గొన్నారు.